సాక్షి జయశంకర్ భూపాలపల్లి

బుధవారం । 26 । జూలై । 2023



ముంచెత్తుతున్న వరద..

తెలంగాణ, మహారాష్ట్రల్లో వర్షాలు కురుస్తుండడంతో గోదావరి, ప్రాణహిత నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో అన్నారం(సరస్వతి) బ్యారేజీకి వరద తాకిడి పెరిగింది.

- 10లో▸



మహిళలకు రక్షణ కరువు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హయాంలో దేశంలో మహిళలకు రక్షణ కరువైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు.

- 10లో▸

గరిష్టం/కనిష్టం
28.0^0 /24.0^0

వాతావరణం

జిల్లాలో ఉపరితల ఆవర్తన ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

న్యూస్‌రీల్

మంత్రిని కలిసిన ఎస్పీ



భూపాలపల్లి అర్బన్: ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పుల్లా కరుణాకర్ మంగళవారం రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్‌ను హైదరబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లా ప్రజలకు అందుబాటులో ఉండి వారి మన్ననలు పొందాలని ఎస్పీకి మంత్రి సూచించారు.

దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి అర్బన్: జిల్లాకేంద్రంలోని మైనారిటీ గురుకుల కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా ఇన్‌చార్జ్ మైనారిటీ సంక్షేమ అధికారిని బుర్ర సునీత మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీటీ ఉర్దూ, పీజీటీ కెమిస్ట్రీ సబ్జెక్టుల అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. అర్హత గల వారు ఈ నెల 27వ తేదీలోగా గురుకుల కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన



భూపాలపల్లి అర్బన్: ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై మండలంలోని గొల్లబుద్దారం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టడీసెంటర్ కోఆర్డినేటర్ మండల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. బడి మధ్యలో మానేసిన వారి కోసం ప్రభుత్వం ఓపెన్ స్కూల్ ద్వారా పదవ, ఇంటర్ తరగతులు పూర్తి చేసుకునే అవకాశం కల్పిస్తుందని రవీందర్‌రెడ్డి తెలిపారు. ఆసక్తి గల వారు వచ్చే నెల 10లోపు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని సూచించారు.

ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



ములుగు: జిల్లా కేంద్రంలోని జాతీయ రహదారిపై భారీగా నిలిచిన వరద నీటితో ప్రయాణికులకు, స్థానికులకు ఇబ్బందులు లేకుండా జీపీ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సీతక్క కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని మహర్షి కళాశాల ఎదుట నిలిచిన వర్షపు నీటిని పార్టీ నాయకులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ పంటపొలాల మీదుగా తోపుకుంట చెరువు నుంచి వస్తున్న వరదనీరు పోవడానికి సరైన కాల్వలు లేకపోవడంతో జాతీయ రహదారిపై నిలిచిపోతుందన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా జిల్లాలో వరదనీరు ఉధృతంగా వస్తుందన్నారు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకొని ఎలాంటి సమస్యలూ తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చింతనిప్పుల భిక్షపతి, కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ, మండల ఇన్‌చార్జ్ కొంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు రసపుత్ సీతారాంనాయక్, ఎంపీటీసీ మావురపు తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

ములుగు రూరల్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు గోవిందరావుపేట మండల పరిధిలోని లక్నవరం చెరువు, మల్లంపల్లి పెద్ద చెరువు, ములుగు లోకం చెరువు, జంగాలపల్లి చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఈ మేరకు మంగళవారం ఎమ్మెల్యే సీతక్క ఉధృతంగా ప్రవహిస్తున్న బొగ్గుల వాగును సందర్శించారు. దీంతో పాటు ములుగు నుంచి దేవగిరిపట్నం వెళ్లే దారిని పరిశీలించారు. రోడ్డు మొత్తం గుంతలమయంగా మారి అధ్వానంగా తయారైందని తెలిపారు. ప్రజలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని ప్రభుత్వం రోడ్డు మంజూరి చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎస్సీ కాలనీ జలదిగ్బంధం..

టేకుమట్ల: వర్షాలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా మండలంలోని పెద్దంపల్లి ఎస్సీ కాలనీ జలదిగ్బంధమైంది. అంబాల సతీష్ ఇంట్లోకి నీరు చేరడంతో ఇంట్లో నిల్వ చేసిన పత్తి తడిసింది. కొయ్యల చందుకు చెందిన రెండెకరాల పత్తి పంట వరద ఉధృతికి పూర్తిగా దెబ్బతింది. అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు చెరువును తలపించి రోడ్డు శిథిలం కావడంతో రాకపోకలకు విఘాతం కలిగింది. ఎస్సై చల్ల రాజు పెద్దంపల్లికి చేరుకుని జేసీబీ సహాయంతో కల్వర్టులో చిక్కుకున్న చెత్తను తొలగించారు. సహాయక చర్యల్లో ఎస్సైతో పాటు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్, కానిస్టేబుల్ మధుకర్, హర్షితారెడ్డి, మహేందర్ పాల్గొన్నారు. టేకుమట్లలో చలివాగు ఉధృతంగా ప్రవహించింది.



టేకుమట్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న చలివాగు

రేగొండలో..

రేగొండ మండలంలోని పాండవుల గుట్టలో జలపాతం కనువిందు చేసింది. జలపాతంలో పర్యాటకులు స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. రావులపల్లి–జూబ్లీనగర్ గ్రామాల మధ్య గల లోలెవల్ కల్వర్టుపై నుంచి వరద ఉధృతి పెరగడంతో రవాణా స్తంభించింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గోరికొత్తపల్లి మండలంలోని జంషెడ్‌బేగ్‌పేట్ చెరువు మత్తడి పోయడంతో కొత్తపేట–గోరికొత్తపల్లి మధ్య గల లోలెవల్ కల్వర్టుపై వరద ప్రవాహం ఎక్కువ కావడంతో పర్కాల–గోరికొత్తపల్లికి రాకపోకలు నిలిచిపోయాయి.

టేకుమట్ల: మత్తడిపోస్తున్న వెలిశాల చెరువు



దంచికొట్టింది

జిల్లావ్యాప్తంగా భారీ వర్షం

- మత్తడి పోస్తున్న చెరువులు, కుంటలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న మానేరు, మోరంచ వాగులు
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం
- మండలాల్లో కూలిన పాత ఇళ్లు..
- చెరువును తలపించిన చెల్పూరు ప్రభుత్వ పాఠశాల

జిల్లావ్యాప్తంగా సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం వరకు భారీ వర్షం కురిసింది. వారం రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని చెరువులు, కుంటలు మత్తడిపోతున్నాయి. మానేరు, మోరంచ వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో పలు చోట్ల రాకపోకలు ఇబ్బందులు తలెత్తాయి. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు ప్రమాదకరంగా ట్రాక్టర్ల ద్వారా వాగులు దాటారు. పలు మండలాల్లో ఇళ్లు కూలిపోయాయి. గణపురం మండలం చెల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలోకి వర్షపు నీరు రావడంతో చెరువును తలపించింది.

చెరువును తలపిస్తున్న పాఠశాల..

గణపురం: గణపురం మండలం చెల్పూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 200 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. మంగళవారం కురిసిన వర్షానికి పాఠశాల ఆవరణ చెరువును తలపించింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు నీళ్లలో నుంచి నడుచుకుంటూ వెళ్లారు. పాఠశాల పరిస్థితిని గతంలో కలెక్టర్, అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. అయినప్పటికీ ఎలాంటి పనులు చేపట్టింది లేదు. నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వర్షపు నీటిలో నుంచి వెళ్తున్న విద్యార్థులు

వర్షపాతం వివరాలు.. (మి.మీ..)	
మల్హర్	160.4
టేకుమట్ల	133.6
రేగొండ	144.0
గణపురం	110.8
చిట్యాల	101.4
మొగుళ్లపల్లి	99.2
భూపాలపల్లి	85.4
పలిమెల	29.2
కాటారం	28.2
మహదేవపూర్	24.2
మహాముత్తారం	23.0

రాకపోకలు నిలిపివేత..

కాటారం: మండలంలోని పలు వాగుల్లోకి వరద నీరు చేరడంతో ఉప్పొంగి ప్రవహించాయి. పోతుల్వాయి సమీపంలోని బొర్రవాగు కాజ్‌వేపై నుంచి ప్రవహించగా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ట్రాక్టర్ అడ్డుపెట్టి కాటారం–మేడారం రహదారిపై రాకపోకలు నిలిపివేశారు. వాహనదారులు కాజ్‌వే పై నుంచి వెళ్లి ప్రమాదాలకు గురికావద్దని హెచ్చరికలు జారీచేశారు. వర్షం కొనసాగితే మండలంలోని మరిన్ని వాగులు రోడ్లపై నుంచి ప్రవహించి పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయే అవకాశం ఉంది.

ఉధృతంగా మానేరు

మల్హర్: వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తాడిచెర్ల–ఖమ్మంపల్లి జిల్లా సరిహద్దు మానేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో జళకళ సంతరించుకుంది. మండలంతో పాటు భూపాలపల్లి, కరీంనగర్ జిల్లాలో కురిసిన వర్షాలతో మానేరుకు భారీగా వరద నీరు చేరుకుంది. దీంతో వాగుకు ఇరువైపులా నీరు ప్రవహించడంతో జళకళ సంతరించుకొని నిండు కుండలా దర్శనమిస్తుంది.

23 అడుగులకు చేరిన గణపసముద్రం

గణపురం: గణపురం మండలంలో సుమారు 70 చెరువులు, కుంటలు పూర్తి స్థాయిలో నిండి మత్తడి పోస్తున్నాయి. గణపసముద్రం చెరువు 30 అడుగులకు గాను 23 అడుగులకు చేరుకుంది. మండలంలోని బుద్దారం వంగపెల్లివాని చెరువుతో పాటు రేగొండ మండలం భాగిర్థిపేట చెరువు మత్తడి పోస్తుండడంతో గణపసముద్రంలోకి పెద్ద ఎత్తున వరద వస్తుంది. మండలంలో మోరంచ వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. గణపురం మండలం కొండాపురం–వెంకటాపురం మండలం వెల్తుర్లపల్లి గ్రామాల మధ్య మోరంచవాగు లోలెవల్ వంతెనపై వాగు ప్రవాహంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.



ఉధృతంగా ప్రవహిస్తున్న మోరంచవాగు

గ్రామాలు జలమయం

చిట్యాల: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని కొన్ని గ్రామాలు జలమయమయ్యాయి. వెంచరామి వద్ద మోరంచవాగు, నవాబుపేట వద్ద చలివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గిద్దెముత్తారం గ్రామ శివారు వద్ద ఉన్న చెరువులోకి వర్షపు నీరు రావడంతో కాల్వపల్లికి పోయే రోడ్డు మొత్తం కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలు స్తంభించాయి. విద్యుత్ స్తంభం కూలిపోయింది. గిద్దెముత్తారం గ్రామ శివారు లంబాడితండాకు పోయే దారిలో లోలెవల్ బ్రిడ్జి ఉండడంతో ఎర్ర చెరువు వద్దకు వచ్చిన నీరు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో అత్యవసర పని మీద వెళ్లే వారు ట్రాక్టర్‌లో ఎక్కి వెళ్లారు. పాశిగడ్డతండా, వెంచరామి, గిద్దెముత్తారం గ్రామాలను తహసీల్దార్ సుమన్, ఎంపీఓ రామకృష్ణ, ఆర్ఐ రాజు పరిశీలించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. మోరంచ వాగుపై చేపడుతున్న బ్రిడ్జి పనులు నిలచిపోయాయి.



ట్రాక్టర్‌లో ప్రమాదకరంగా వాగు దాటుతున్న ప్రజలు



కూలిన పాఠశాల రేకులు



రేగొండ: ఇంటి ముందు బాధితులు



కాటారం మండలం మద్దులపల్లిలో..

ఇళ్లు నేలమట్టం..

రేగొండ(టేకుమట్ల)/కాటారం/భూపాలపల్లి రూరల్/మల్హర్/చిట్యాల: మంగళవారం కురిసిన వర్షాలకు రేగొండ, కాటారం, భూపాలపల్లి, మల్హర్, చిట్యాల మండలాల్లో పలు ఇళ్లు నేలమట్టమయ్యాయి. భూపాలపల్లి మండలం గుర్రంపేట గ్రామంలోని గుంటుకు కృష్ణ ఇళ్లు నేలకూలింది. ఓపెన్ కాస్ట్‌లో పేల్చే బాంబు బ్లాస్టింగ్‌లకు గతంలో కొంతమేర దెబ్బతింది. మంగళవారం నేలమట్టమైంది. చిట్యాల మండలం గిద్దెముత్తారం గ్రామానికి చెందిన పంచిక రాజమ్మ ఇళ్లు పూర్తిగా కూలిపోయింది. దీంతో ఒకరికి గాయాలయ్యాయి. ప్రాథమిక పాఠశాలలోని రేకుల గది కూలిపోయింది. రేగొండ మండల కేంద్రంలోని గడిపల్లి కాలనీ బండి రాధమ్మకు చెందిన ఇళ్లు నేలమట్టమైంది. పంచాయతీ కార్యదర్శి తాల్జారాణి ఇంటిని పరిశీలించారు. టేకుమట్ల మండలం పెద్దపల్లి గ్రామంలో పది ఇళ్లలోకి నీరు చేరాయి. కాటారం మండలం మద్దులపల్లికి చెందిన గుండపు ఎర్రయ్య ఇళ్లు కూలిపోయింది. మల్హర్ మండలం పెద్దతాడిచర్లలోని పలు ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో ఇంట్లోని వంట సామగ్రి, ఎలక్ట్రికల్ వస్తువులు తడిసిపోయాయి.



మల్హర్: ఇంట్లోకి చేరిన వరద నీరు



గుర్రంపేటలో నేలకూలిన ఇళ్లు



చిట్యాల: కూలిన ఇళ్లు

మీనం.. ఘనం..
- వేర్వేరు చోట్ల వలలకు చిక్కిన పెద్ద చేపలు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు
- ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, సీపీ, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్

మత్తళ్లు.. పరవళ్లు
- నిండుకుండలా చెరువులు

- వివరాలు 8లో▸
- మరిన్ని ఫొటోలు 9లో▸

పాఠశాలలను తనిఖీ చేసిన ఎమ్మెల్యే

భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు కేజీబీవీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంగళవారం ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలో తాగునీటి సమస్య ఉందని విద్యార్థులు తెలియజేయగా ఎమ్మెల్యే వెంటనే ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్‌కు ఫోన్‌చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. పాఠశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను తొలగించాలని సూచించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన మధ్యాహ్న భోజనం అందించాలని ప్రధానోపాధ్యాయురాలిని ఆదేశించారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

పంట నష్ట పరిహారం చెక్కుల పంపిణీ

మున్సిపాలిటీ పరిధిలోని జంగేడు శివారులో వేసవికాలంలో అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులకు ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. రైతులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటూ పంటలకు కావాల్సిన పెట్టుబడి సాయం అందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సంక్షేమ హాస్టళ్లలోని సమస్యలు పరిష్కరించాలి

కాటారం: ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బొడ్డు స్మరన్, కార్యదర్శి కుమ్మరి రాజు డిమాండ్ చేశారు. విద్యారంగ సమస్యలపై ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సంఘర్షణ సైకిల్‌యాత్ర మంగళవారం కాటారం చేరుకుంది. ఈ సందర్భంగా మండలకేంద్రంలో అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆరోపించారు. సంక్షేమ హాస్టళ్లలో మెస్ బిల్లులు రాక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పెంచిన మెస్‌చార్జీలు ఇప్పటికీ అమలు చేయకపోగా గత ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. మెస్, కాస్మోటిక్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం విద్యావ్యవస్థలో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని లేకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు చెన్నూరి రాజు, నరేశ్, గజ్జల కార్తిక్, సాయిచరణ్, తరుణ్, విజయ్, రిత్విక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

టీటీసీ శిక్షణ పొందిన అభ్యర్థులకు పరీక్షలు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో 43 రోజుల పాటు టీటీసీ టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ (లోయర్ గ్రేడ్) థియరీ పరీక్షలు నిర్వహించేందుకు టైంటేబుల్ విడుదల చేసినట్లు హనుమకొండ డీఈఓ ఎండీ అబ్దుల్‌హై మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో ఆయా పరీక్షల్లో ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా ఈటీటీసీ పరీక్షలకు హాజరు కావొచ్చని తెలిపారు. ఆగస్టు 12 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎడ్యుకేషనల్ సైకాలజీ అండ్ స్కూల్ అడ్మినిస్ట్రేషన్ ఆగస్టు 12న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే రోజు మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (జనరల్) సబ్జెక్ట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 3గంటల వరకు, మెథడ్స్ ఆఫ్ టీచింగ్ (స్పెషల్) సబ్జెక్టు మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు నిర్వహించనున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై తెలిపారు.

నేటి నుంచి శాల సిద్ధిపై శిక్షణ

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఎంపిక చేసిన 31 పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఈనెల 26, 27 తేదీల్లో రెండ్రోజులు హసన్‌పర్తి మండలం మిలీనియం పాఠశాలలో శాల సిద్ధి (ప్రమాణాలు, స్వీయ మూల్యాంకణ కార్యక్రమం)పై శిక్షణ ఇవ్వనున్నట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా 11 ఉన్నత పాఠశాలలు, ఐదు ప్రాథమికోన్నత పాఠశాలలను, 15 ప్రాథమిక పాఠశాలలను శాలసిద్ధికి ఎంపిక చేశారు. హైస్కూళ్ల నుంచి ఒక హెచ్‌ఎం, ఇద్దరు టీచర్లు, యూపీఎస్ నుంచి ఒక హెచ్‌ఎం, మరో టీచర్, ప్రాథమిక పాఠశాలల నుంచి ఒక హెచ్‌ఎం, ఒక టీచర్ చొప్పున ఎంపిక చేసిన ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపిక చేసిన పాఠశాలలకు ఇప్పటికే సంబంధిత క్లస్టర్ రిసోర్స్‌పర్సన్లు, మండల రిసోర్స్ సెంటర్ల ద్వారా సమాచారం అందించారు.

పకడ్బందీగా హరితహారం

కలెక్టర్ భవేష్ మిశ్రా

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో 9వ విడత హరితహారం కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా అధికారులను ఆదేశించారు. 9వ విడత హరితహారంపై సంబంధిత అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. 2022–23 సంవత్సరం జిల్లాలో 40.88 లక్షల మొక్కలు నాటాలన్నారు. మున్సిపాలిటీలో, గ్రామాలలో మొక్కలు నాటేందుకు గుర్తించిన ప్రాంతాలలో మొక్కలు నాటాలని అధికారులను ఆదేశించారు. వచ్చే నాలుగు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఈ సమయాన్ని గుంతలు తవ్వకానికి వినియోగించుకోవాలని సూచించారు. నర్సరీలో మొక్కల పెంపకంపై అటవీ అధికారులు సాంకేతిక పరిజ్ఞానం, మార్గదర్శకాలు అందజేయాలన్నారు. జిల్లాలో రోడ్ల వెంబడి మల్టీ లేయర్ అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు నాటడం రెండవ ప్రాధాన్యత కింద తీసుకోవాలని చెప్పారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయానికి గ్రీన్ ఫెన్సింగ్ ఏర్పాటుచేసే దిశగా మొక్కలు నాటడానికి మూడో ప్రాధాన్యత కింద తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఓ పురుషోత్తం, జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి, మున్సిపల్ ఇన్‌చార్జ్ కమిషనర్ అనిల్, ఎంపీడీఓ, అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రమాదకర గుంత పూడ్చివేత

కాటారం: శాంతిభద్రతల పరిరక్షణలోనే కాదు..సమాజ సేవలోనూ ముందుంటూ శభాష్ అనిపించుకుంటున్నారు కాటారం పోలీసులు. వర్షాల కారణంగా కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో ప్రమాదకరమైన భారీ గుంత ఏర్పడింది. గుంత నిండా నీరు నిల్వడంతో ఇది గమనించక వాహనదారులు అందులో పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో వాహనదారుల కష్టాలు తొలగించాలని భావించిన సీఐ రంజిత్‌రావు ఆదేశాల మేరకు కాటారం ఎస్సై అభినవ్, సిబ్బంది మంగళవారం మట్టితో గుంతను పూడ్చివేయించారు. గుంత పూడ్చి ప్రమాదాల నివారణకు కృషిచేసిన పోలీసులను వాహనదారులు, ప్రజలు అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు హరి, వేణు, జంపన్న, లక్ష్మిరాజ్, ప్రసాద్, సీఆర్పీఎఫ్ జవాన్ మనోహర్ పాల్గొన్నారు.



గుంతను పూడ్చివేయిస్తున్న పోలీసులు

మీనం.. ఘనం..

- వేర్వేరు చోట్ల వలలకు చిక్కిన పెద్ద చేపలు

చిల్పూరులో 12 కిలోల పాపర చేప..



పాపర చేపతో లింగయ్య

చిల్పూరు: జనగామ జిల్లా చిల్పూరు మండల కేంద్రంలోని ఆకేరు వాగు చెక్ డ్యాం వద్ద మంగళవారం సాయంత్రం 12 కిలోలు ఉన్న పాపర చేప వలకు చిక్కింది. గ్రామానికి చెందిన దామెర లింగయ్య చెక్‌డ్యాం వద్ద వల వేయగా ఈ చేప చిక్కింది. దీనిని స్థానికులు ఆసక్తిగా తిలకించారు.

చిన్నోడికి చిక్కిన పెద్ద చేప..



చేపను చూపుతున్న యశ్వంత్

చెన్నారావుపేట: చెన్నారావుపేట శివారులోని కోపాకుల చెరువు మంగళవారం మత్తడి పోయగా ప్రజలు చేపల వేటకు వెళ్లారు. ఇదే గ్రామానికి చెందిన రాకం యశ్వంత్ కూడా వెళ్లాడు. అక్కడ ఈ చిన్నోడి వలకు పెద్ద చేప చిక్కింది. దీంతో ఆ బుడతడి ఆనందానికి అవధులు లేకుండాపోయింది. మండల కేంద్రానికి తీసుకొచ్చి విక్రయించాడు. 10 కిలోలు ఉండడంతో రూ. 1000 విక్రయించాడు. చిన్నోడికి అదృష్టం కలిసొచ్చిందని పలువురు చర్చించుకోవడం విశేషం.

జంగాలపల్లిలో 6 కిలోల వాలుగ..



వాలుగతో పవన్

ములుగు: ఇటీవల కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఈ క్రమంలో ములుగు మండలం మేడివాగు వద్ద ప్రజలు మంగళవారం చేపలు పట్టారు. ఇందులో జంగాలపల్లి గ్రామానికి చెందిన పవన్ వలకు 6 కిలోల వాలుగ చిక్కింది.

హన్మకొండ: మత్తడి పోస్తున్న భద్రకాళి చెరువు



కురవి : అలుగు పోస్తున్న నల్లెల్ల చెరువు



నర్సింహులపేట : కొమ్ములవంచలో మత్తడి పోస్తున్న కొత్త చెరువు



మత్తళ్లు..పరవళ్లు

ఉమ్మడి జిల్లాలో కుండపోత వర్షం..

- అలుగు పోస్తున్న చెరువులు, కుంటలు
- పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు, మూడు రోజుల నుంచి కుండపోత వర్షం కురుస్తోంది. దీంతో ఇంత కాలం నెర్రెలు బారిన చెరువులు, కుంటలు మత్తళ్లు పరవళ్లు దూకుతున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఫలితంగా కనుచూపు మేర నీరే కనిపిస్తోంది. కాగా, మత్తళ్ల వద్ద ప్రజలు చేపలు పడుతుండడంతో ఆ ప్రాంతంలో సందడి నెలకొంటుంది.

-సాక్షి నెట్‌వర్క్



కాజీపేట : సోమిడిలో పొంగిపొర్లుతున్న ఊర చెరువు

దేవరుప్పుల: మత్తడి పోస్తున్న కడవెండి వాగు





దామెర : మత్తడి పోస్తున్న దామెర గిద్దె చెరువు



నర్సంపేట రూరల్ : మత్తడి పోస్తున్న మాదన్నపేట చెరువు



అలుగుపోస్తున్న మానుకోటలోని నిజాం చెరువు



గంగారం : గంగారంలో మత్తడిపోస్తున్న చెరువు



శాయంపేట : అలుగుపోస్తున్న చలివాగు



సంగెం : మత్తడి పోస్తున్న ఎల్గూర్‌రంగంపేట చెరువు



మహబూబాబాద్‌లోని జమండ్లపల్లి వద్ద మున్నేరు వాగు..



సంగెం : మత్తడి పోస్తున్న కుంటపల్లి చెరువు

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

సాక్షి ప్రతినిధి, వరంగల్: వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, వరదలు, లోతట్టు ప్రాంతాల జలమయం, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర పరిస్థితుల్లో, రెస్క్యూ టీమ్స్, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు తదితర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు, సీపీ, ఎస్పీలు, ఇతర అధికారులతో మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల పరిస్థితి, ముందు జాగ్రత్త చర్యలను కలెక్టర్లు మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దయాకర్ రావు మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల జిల్లాల్లో రెడ్ అలెర్ట్ ఉందని, ప్రజలకు ఏ సమస్య ఉన్నా అధికారులకు తెలపాలన్నారు. ఏ సమయంలో ఏ సమస్య వచ్చినా వెంటనే అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. అలాగే, జిల్లా కలెక్టరేట్లలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలన్నారు. కాగా, 2 రోజులుగా కురుస్తున్న వర్షాలపై ఆరా తీసిన మంత్రి.. అధికారులు అందుబాటులో ఉండాలని చెప్పారు. ఇదే సందర్భంలో తాను కూడా సహాయక చర్యలలో పాల్గొంటున్నానని, ప్రజాప్రతినిధులు, యువత కూడా అధికారులకు సహకరించాలని కోరారు.



ఉమ్మడి వరంగల్ కలెక్టర్లు, ఎస్పీలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి

బైక్‌ను ఢీకొన్న ట్రాలీ ఆటో

- వాహనదారుడి దుర్మరణం



శివ (ఫైల్)

గార్ల: ఎదురుగా అతివేగంగా వచ్చిన ఓ ట్రాలీ ఆటో..బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతిచెందాడు. గార్ల మండలం అంజనాపురం గ్రామానికి చెందిన సపావట్ శివ(30) పెద్ద కుమారుడు గత ఏడాది కారేపల్లి మండలం గాంధీపురంలోని గిరిజన గురుకుల పాఠశాలలో చదువుకున్నాడు. ఈ ఏడాది గార్లలోనే చదువుకుంటానని తెలుపడంతో శివ.. మంగళవారం ఉదయం కుమారుడి టీసీ తీసుకొచ్చేందుకు బైక్ పై బయలుదేరాడు. ఈ క్ర మంలో కారేపల్లి మండలం ఊట్కూరు స్టేజీ వద్ద ఎ దురుగా అతి వేగంగా వస్తున్న ట్రాలీ ఆటో బైక్‌ను ఢీకొంది. దీంతో శివ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న మహిళ మృతి



కవిత (ఫైల్)

నర్మెట : పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని వెల్దండలో జరిగింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం సిద్దిపేట జిల్లా కొమురవెల్లికి చెందిన దొడ్ల వెంకటమ్మ, సిద్దయ్య దంపతుల కూతురు కవిత (28)కు మండలంలోని వెల్దండకు చెందిన బైరగోని కౌసల్య, ఎల్లయ్య దంపతుల కుమారుడు సాంబయ్యతో 2014లో వివాహం జరిగింది. ఈక్రమంలో దంపతుల మధ్య తరచూ గొడవలు చోటు చేసుకోవడంతో పెద్దమనుషులు పలుమార్లు సర్దిచెప్పారు. కాగా, ఆదివారం రాత్రి సాంబయ్య చేయి చేసుకోవడంతో మనస్తాపం చెందిన కవిత పురుగుల మందుతాగి అపస్మారక స్థితికి చేరుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు జనగామ ఏరియా ఆస్పత్రికి.. అక్కడి నుంచి వరంగల్ ఎంజీఎం తరలించారు. పరిస్థితి విషమించడంతో సోమవారం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందింది. ఈ ఘటనపై భర్త,అత్త మామల వేధింపులే కారణమంటూ మృతురాలి బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

విద్యార్థి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి మంగళవారం ఆత్మహత్యకు యత్నించాడు. కొన్ని రోజుల నుంచి మానసికంగా ఇబ్బంది పడుతున్న ఆ విద్యార్థికి తల్లిదండ్రులు చికిత్స నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సహా విద్యార్థులతో తనకు చనిపోవాలని ఉందని చెప్పి వెంట తెచ్చుకున్న ఎలుకల మందు తాగాడు. వెంటనే తోటి విద్యార్థులు ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆ విద్యార్థి క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై ఎంఈఓ పూల్‌చంద్‌ను వివరణ కోరగా మానసికంగా ఇబ్బంది పడుతూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు తెలిసిందన్నారు. దీనిపై విచారణ చేపడుతామన్నారు.

నీరు వెళ్లే దారేది...



చిన్నవడ్డేపల్లి చెరువు మత్తడి వద్ద మూసి ఉన్న తూము.. పైనుంచి పోతున్న వరద నీరు

- గుడిసెలు వేసి అడ్డుగా మట్టి పోసి
- అవుట్ ఫ్లో లేక..ముంపులోనే కాలనీలు..
- పనిచేయని తూములు..
- పట్టించుకోని అధికారులు



మళ్లీ మునిగిన 14వ డివిజన్‌లోని లక్ష్మీగణపతి, మధురానగర్ కాలనీలు

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శివారు ప్రాంతాల్లో సైడ్‌కాల్వలు, కల్వర్టులు, బాక్స్ డ్రెయిన్ల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించడంతో రెండేళ్ల క్రితం పనులు ప్రారంభమయ్యాయి. రెండు వర్షాకాలాలు పోయినప్పటికి పనులు పూర్తి కాకపోవడంతో శివారు ప్రాంతమైన 14, 18వ డివిజన్‌లలో పలు కాలనీలు ఆదివారం నుంచి కురిసిన భారీ వర్షంతో జలమయమయ్యాయి.

గుడిసెలు వేసి.. అడ్డుగా మట్టి..

చిన్నవడ్డేపల్లి చెరువులో వామపక్ష పార్టీల అధ్వర్యంలో గుడిసెలు వేసిన వారు పై ప్రాంతాలనుంచి చెరువులోకి వచ్చే కాలువకు అడ్డంగా మట్టిపోయడంతో వర్షపు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. గత వారం కమిషనర్ వచ్చి అడ్డుగా ఉన్న మట్టి తీయాలని ఆదేశించగా తూతూమంత్రంగా తీయడంతో మళ్లీ నీరు నిలిచింది. దీనికి తోడుగా వరద వచ్చినప్పుడు అదనంగా నీరు పోయేందుకు మత్తడిపై రెండు తూములు ఏర్పాటు చేశారు. ఈ తూములను ఇరిగేషన్, మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో ఒక తూము పూర్తిగా మూసి ఉండడం కూడా కాలనీలు మునిగిపోయేందుకు కారణంగా భావిస్తున్నారు. ఒక తూము తీసినా పైనుంచి వచ్చే వరద మత్తడి పైనుంచి పోయింది. మరో తూము తీస్తే కాలనీలు మునక బారినుంచి బయటపడే అవకాశాలున్నాయి.

ఇన్‌ఫ్లో ఎక్కువ..అవుట్ ఫ్లో తక్కువ..

కాలనీల్లో పడిన నీరు పెద్ద మొత్తంలో బయటకు పోయే వీలు లేనందునే ముంపునకు గురువుతున్నాయి. నగరంలోని 18, 19, 14, 4వ డివిజన్లలో వర్షపు నీరు గరీబ్‌నగర్, 100ఫీట్లరోడ్డు, గాంధీనగర్, ఎస్ఆర్‌నగర్, లక్ష్మీగణపతికాలనీ, శ్రీసాయిగణేష్ కాలనీల మీదుగా చిన్నవడ్డేపల్లి చెరువులోకి వెళ్లాల్సి ఉంది. కానీ ఏనుమాముల రహదారి అడ్డంగా ఉండడం, నీరు వెళ్లేందుకు సరైన అవుట్ లెట్‌లను ఏర్పాటు చేయకపోవడం వల్ల పై కాలనీలు అన్ని రోజుల తరబడి ముంపులోనే ఉంటున్నాయి. కాశిబుగ్గ-ఏనుమాముల ప్రధాన రహదారి మధ్యలో రెండు చోట్ల అవుట్‌లెట్‌లు నిర్మించాల్సి ఉండగా తాగునీటి పైపులైన్లు అడ్డుగా ఉన్న కారణంగా ఒకే చోట రెండు పైపులతో కల్వర్టులు నిర్మించినా వరద మాత్రం తగ్గలేదు. నాలుగు డివిజన్లలోని ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు ఒకేచోట నుంచి పోవడం వల్ల ఈపరిస్థితులు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలో నీరు చెరువులోకి పోకపోవడంతో పెట్రోల్‌బంకు వరకు వరద నిలిచిపోయింది.

పైపులు వేయడంలో నిర్లక్ష్యం..



ఏనుమాముల బాలాజీనగర్-నర్సంపేటరోడ్డు వరకు ఉన్న 100ఫీట్ల రోడ్డుపై అనకొండలా ఉన్న డ్రెయిన్ నిర్మాణం కోసం తెచ్చిన పైపులు

నర్సంపేట రోడ్డు నుంచి ఏనుమాముల బాలాజీ జంక్షన్ వరకు నిర్మించిన స్మార్ట్ రోడ్డుకు ఇరువైపులా డ్రెయిన్ నిర్మించాల్సి ఉంది. కాంట్రాక్టర్ తన స్వలాభం కోసం డ్రెయిన్ స్థానంలో పైపులు వేసేందుకు మార్పులు చేయించుకున్నాడు. పైపులు రోడ్డు మధ్యలో స్టాక్ పెట్టి 6నెలలు దాటింది. వాటిని వేయాలని చెప్పే ధైర్యం అధికారులకు, స్థానిక ప్రజాప్రతినిధులకు లేకుండా పోయింది. సదరు కాంట్రాక్టర్ అధికార పార్టీ ఎమ్మెల్యేకు సోదరుడు కావడమే కారణంగా తెలుస్తోంది. ఈ ఏరియా మరో ఎమ్మెల్యే పరిధిలో ఉన్నప్పటికి ఆయన కూడా చెప్పలేని స్థితిలో ఉన్నట్లు తెలిసింది. ఈ విషయం ముంపు పరిశీలనకు వచ్చి మంత్రి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లగా మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

లైంగిక వేధింపులు..

- వివాహిత ఆత్మహత్య



మంజుల(ఫైల్)

వర్ధన్నపేట : లైంగిక వేధింపులతో ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వర్ధన్నపేట ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరు గ్రామానికి చెందిన పస్తం శ్రీనుకు 2006 సంవత్సరంలో మంజుల (34)తో వివాహం జరిగింది. బతుకుదెరువు నిమిత్తం 10 సంవత్సరాల క్రితం ముంబై వెళ్లిన దంపతులు.. మూడు నెలల క్రితం ఇంటికి చేరుకున్నారు. ఈక్రమంలో మండలంలోని ఎలికట్ట గ్రామం టిక్షతండాకు చెందిన జాటోత్ జితేందర్‌కు తమ ఇంట్లోని ఓ గదిని అద్దెకు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జితేందర్ తరుచూ మంజులను లొంగదీసుకోవాలని యత్నించాడు. దీనిపై తొర్రూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు జితేందర్‌కు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా ఆయనలో మార్పు రాకపోవడంతో మరోసారి పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఈ వేధింపులు తాళ లేక మంజుల 15 రోజుల క్రితం తన సోదరి శారద ఇంటికి వెళ్లింది. అక్కడ మంజులకు మాయమాటలు చెప్పిన జితేందర్.. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలోని తన గదికి తీసుకెళ్లాడు. అక్కడ లైంగిక దాడికి యత్నించడంతో మంజుల ఎలుకల మందు తాగి ఆత్మహత్యకు యత్నించగా వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనలో లైంగిక వేధింపులు తట్టుకోలేక తన భార్య మంజుల ఆత్మహత్యకు పాల్పడిందని భర్త శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

మహిళ బలవన్మరణం



నిఖిత మృతదేహం

వరంగల్ క్రైం : భర్తతో పాటు కుటుంబ సభ్యుల వేధింపులతో ఓ వివాహిత బలవన్మరణానికి పాల్పడింది. సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధి న్యూశాయంపేటలోని బొల్లెనవాడకు చెందిన జంగ్లీ నిఖిత (21) ఈనెల 24న రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి యేసోబు ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త మహ్మద్ హసనుద్దీన్, కుటుంబ సభ్యులు సుల్తానా, కమాలుద్దీన్, యాకూబ్‌పై కేసు నమోదు చేసినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు.